
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



తరగతి గదిలో...



- స్వర్ణోత్సవాలకు సిద్ధమైన ఆత్మకూరు జూనియర్ కళాశాల
- అనేక ఒడిదుడుకుల నడుమ 1974లో ఏర్పాటు
- 50ఏళ్ల ప్రస్థానంలో వేలాదిగా వికసించిన విద్యా కుసుమాలు
- 4,5 తేదీలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1974 బ్యాచ్ విద్యార్థులు, అధ్యాపకులు

అరేయ్.. ఒరేయ్.. ఒసేయ్.. అన్న నిస్వార్థ పిలుపులు, జ్ఞాపకాలు మదిలో ఎప్పటికీ నిలిచిపోతాయి. హోదా పెరిగి ఏ స్థాయిలో ఉన్నప్పటికీ కొందరు ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోరు. కాలం ఎంత పరుగు తీసినా అవి మనసులో నుంచి చెదిరిపోవు. చదివిన కళాశాల తరగతి గదుల్లోకి తొంగి చూస్తే గత అనుభూతులతో మనసు విద్యార్థి దశకు మారిపోతుంది. నాడు చదువుల కోవెలలో సందడి చేసిన రోజు మళ్లీ గుండె గదిలో జ్ఞాపకమై కదలాడిపోతుంది. ఆగిపోయిన స్నేహ గీతం రాగమై వినిపిస్తుంది. హృదయంలో కళాశాల తరగతి గది పేజీ ఆవిష్కృతమవుతుంది. కళాశాలను వదిలేసి దశాబ్దాలు గడిచిన తర్వాత మళ్లీ ఆ హ్యాపీ డేస్‌కు సిద్ధమైంది ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల. రేపటి నుంచి రెండు రోజుల పాటు పూర్వ విద్యార్థుల కలయికతో కళాశాల మునుపటి రోజులు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మరోసారి చూసి పూర్వవిద్యార్థులు మురిసిపోనున్నారు. యాభైఏళ్ల నల్లమల కళాశాల ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

వివరాలు 6లో..

మార్కెట్ పాలనాధీశులు ఎవరు..?



రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గాల నియామకానికి టీడీపీ కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సంక్రాంతి నాటికి ఏఎంసీల నూతన పాలనాధీశులు కొలువుదీరే అవకాశం ఉంది. చైర్మన్, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను నామినేట్ చేయనున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లు రిజర్వేషన్లు ఖరారు చేశారు. పదవుల పందేరంలో ఆశావహులు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో దాదాపుగా ఖరారు అయినప్పటికీ మెజార్టీ నియోజకవర్గాల్లో మార్కెట్ చైర్మన్‌గా సమర్థవంతమైన వ్యక్తిని ఎంపిక చేసేందుకు ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు. త్వరలో చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు డైరెక్టర్ల జాబితా పంపాలంటూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జ్‌లకు అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏఎంసీ నామినేటెడ్ పదవుల పందేరంతో రాజకీయ వేడి రాజుకుంది.

- ఏఎంసీల నూతన పాలకవర్గాలపై కసరత్తు
- ఉమ్మడి కర్నూలులో 15 మార్కెట్ యార్డులు
- రిజర్వేషన్లు ఖరారు చేసిన కలెక్టర్లు
- చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపికలో ఎమ్మెల్యేలు బిజీ
- సంక్రాంతి నాటికి పదవులు భర్తీ చేసే అవకాశం
- కీలక నాయకులపై ఆశావాహుల ఒత్తిళ్లు

కర్నూలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ కమిటీలు రెగ్యులర్‌గా క్రయవిక్రయాలు జరిగితే.. మంత్రాలయం (కోసిగి), కోడుమూరు, ఆలూరు మార్కెట్‌లు అలంకారప్రాయంగా ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కోవెలకుంట్ల మార్కెట్లలో రెగ్యులర్‌గా క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. మిగిలిన మార్కెట్ యార్డులు వారాంతపు మార్కెట్లుగా మారితే.. కొన్ని పేరుకే మార్కెట్‌లుగా ఉన్నాయి. కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్లలో ఏడాదికి రూ.3,600 కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరుగతున్నాయి. మార్కెట్ సెస్సు రూపంలో రూ.36 కోట్లు ఆదాయం వస్తోంది. నంద్యాల జిల్లాలో ఎనిమిది మార్కెట్ యార్డుల పరిధిలో ఏడాదికి రూ.2,600 కోట్ల విలువైన వ్యవసాయ పంట ఉత్పత్తుల లావాదేవీలు జరుగుతున్నాయి. సెస్సు ద్వారా రూ.26 కోట్లు ఆదాయం వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం 2022లో మార్కెట్ కమిటీలకు నూతన పాలవర్గాలను నియమించింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలల తర్వాత నామినేటెడ్ పదవుల పంపకానికి శ్రీకారం చుట్టింది.



రిజర్వేషన్లు ఖరారు చేసిన కలెక్టర్లు

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్ల నియామకాల్లో ఎస్టీలకు 6 శాతం, ఎస్సీలకు 15 శాతం, బీసీలకు 29 శాతం రిజర్వేషన్ కల్పించాలి. మిగిలిన పదవులు ఓపన్ కేటగిరి (ఓసీ)లో భర్తీ చేయాల్సి ఉంటుంది. మొత్తం స్థానాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. ప్రతి మార్కెట్ కమిటీలో వ్యవసాయ/ఉద్యాన శాఖ, కో-ఆపరేటివ్ శాఖ, మార్కెటింగ్ శాఖ, పంచాయతీ/మున్సిపాలిటీల నుంచి నలుగురు ప్రభుత్వ అధికారులు, ముగ్గురు ట్రేడర్స్, 13 మంది రైతులు కలిపి 20 మంది డైరెక్టర్లు ఉంటారు. రిజర్వేషన్లు ఖరారు చేయాలని డిసెంబరు 10న జిల్లా కలెక్టర్లు, మార్కెంటింగ్ శాఖ ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

గతంలో రిజర్వేషన్లు పరిగణలోకి తీసుకున్న అధికారులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. కర్నూలు జిల్లాలో కర్నూలు, పత్తికొండ ఏఎంసీ చైర్మన్ పీఠాలు ఓసీ జనరల్, కోడుమూరు, మంత్రాలయం ఓసీ మహిళా, ఆదోని బీసీ/మైనార్టీ మహిళా, ఎమ్మిగనూరు బీసీ/మైనార్టీ జనరల్, ఆలూరు ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. ఏడింటిలో మూడు స్థానాలు మహిళలకు ఇచ్చారు.

వివరాలు 6లో..

సమగ్ర వివరాలు ఇవ్వాలి

- ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- అధికారులు, ప్రజా సంఘాలతో సమీక్ష



మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల్లోని ఉప కులాలపై ఆయా శాఖల వారిగా సమగ్రమైన వివరాలను ఇవ్వాలని ఎస్సీ ఉప కులాల వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో షెడ్యూల్డ్ కులాల్లోని ఉప వర్గీకరణ అంశానికి సంబం ధించి ఏకసభ్య కమిషన్ సభ్యులు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఈ అంశంపై ప్రజా సంఘాలు, వివిధ సంస్థల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ సభ్యు డు రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఆగస్టు 1, 2024న వెలువరించిన సుప్రీం కోర్టు ఉత్తర్వులను అనుసరించి ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని పూర్వ జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఈ అంశంపై వ్యక్తులు, సంస్థల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. ఉప కులాల వారిగా ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా సమగ్రమైన వివరాలను సేకరించి వాటి ఆధారంగా ఏకసభ్య కమిషన్ సిఫారసులను అందిస్తుందని అన్నారు. ఉప కులాల వారిగా విద్య, ఉపాధి రంగాల్లో ప్రాతినిధ్యంతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ వివరాలను అన్ని ప్రభుత్వ శాఖలు సమగ్రంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీనికి ఒక నమూనా ఇచ్చామని అన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలు ఎన్ని ఉన్నదీ ఉప కులాల వారిగా వివరాలు ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. అలాగే అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన వారి వివరాలను కూడా సమగ్రంగా ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ ఎస్సీ ఉప కులాల వారిగా పూర్తి స్థాయిలో సమగ్రంగా వివరాలను పంపాలని అధికారులను ఆదేశించారు.

వినతుల స్వీకరణ: అనంతరం షెడ్యూల్డ్ కులాల్లోని ఉప కులాల వర్గీకరణకు సంబంధించి వ్యక్తులు, వివిధ సంస్థల నుంచి వినతులను ఏకసభ్య కమిషన్ స్వీకరించింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి తులసిదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈవోఆర్డీపై ఉపసర్పంచ్ చిందులు

గ్రామ సభలో ఘర్షణ



ప్రకాశ్‌నాయుడిని బెదిరిస్తున్న వైసీపీ ఉపసర్పంచ్ సూర్యనారాయణరెడ్డి

కోవెలకుంట్ల, జనవరి 2, (ఆంధ్రజ్యోతి): గ్రామ సభ సాక్షిగా ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడుపై వైసీపీ నేత, ఉపసర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి గురువారం చిందులు తొక్కారు. గురువారం కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను సర్పంచ్ మెట్ల సరళ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడు అజెండా ప్రకారం గతంలో జరిగిన అభివృద్ధి పనులను చదివి వినిపించారు. ఏవైనా సమస్యలు ఉంటే సభ్యులు సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. సభ్యులు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామని ఈవోఆర్డీ తెలిపారు. అనంతరం ఉప సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడిపై వాగ్వివాదానికి దిగి ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నావని ఆరోపించారు. ఇక నుంచి నీ పద్ధతి మార్చుకోవాలని బెదిరించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడు మాట్లాడుతూ తాను రాజకీయ నాయకుడిని కాదని, ప్రజలకు సేవ చేసే ఉద్యోగినని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను పనులు చేయిస్తున్నానని అన్నారు. తాను ఇక్కడ ఉద్యోగిగా పనిచేసినంత కాలం మంత్రి ఆదేశాలతోనే పనిచేస్తానని తెలిపారు. మీకు ఎవరైనా శత్రువులుంటే వారిపై మీ ప్రతాపం చూపుకోమని అన్నారు. పంచాయతీ సభ్యులు జోక్యం చేసుకొని గ్రామ పంచాయతీ అభివృద్ధిపై మాత్రమే సభలో మాట్లాడాలని అనడంతో సభ ముగిసింది.

7

నంద్యాల జిల్లాలో తొలి బ్యాటరీ

స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టు

రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

బోరుబావిలో పేలుడు

ముగ్గురికి గాయాలు

7

మృత్యువులోనూ వీడని దాంపత్యం

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

స్వర్ణ రథంపై విహరించిన ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 2(ఆంధ్రజ్యోతి) మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. ధనుర్మాసం తదియ రాఘవేంద్రస్వామి సజీ వ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావ నానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి మండటపంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

నేడు రామ్‌కో సిమెంటుపై ప్రజాభిప్రాయ సేకరణ ..

- రాజకీయ పార్టీల స్పందనపై సర్వత్రా ఉత్కంఠ
- భారీగా బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



రామ్‌కో సిమెంటు పరిశ్రమ

కొలిమిగుండ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల సమీపంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వద్ద కాలుష్య నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో నేడు శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరగనుంది. సిమెంటు పరిశ్రమ ఉత్పత్తి స్థాయి పెంచుకోవడానికి పర్యావరణ అనుమతుల కోసం ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారు. దీనిపై వివిధ రాజకీయ పార్టీలు ఎలా స్పందిస్తాయనే దానిపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే పరిశ్రమ నుండి వెలువడుతున్న కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని గత రెండు రోజుల క్రితం రైతులు ఆందోళన చేపట్టారు. అయితే రైతుల ఆందోళనకు ఏ రాజకీయ పార్టీ నాయకులు మద్దతు ప్రకటించలేదు. ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన గళం వినిపించకుండా పరిశ్రమ వర్గాలు సైతం అత్యంత జాగ్రత్తతో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ రాజకీయ పార్టీల నేతలను, ప్రజాప్రతినిధులను, వివిధ వర్గాల వారిని కలిసి పరిశ్రమకు సహకరించాల్సిందిగా పరిశ్రమలోని కీలక ప్రతినిధులు కోరారు. దీంతో ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన గళం వినిపించే అవకాశాలు తక్కువేనని చర్చ నడుస్తోంది. అయితే ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారా ..? లేదా అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో ఉత్కంఠత ఏర్పడింది. అయితే రైతుల నుండి ఎలాంటి స్పందన ఉంటుందోనని పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో ఆల్ట్రాటెక్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణలో జరిగిన గందరగోళ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, పెద్ద ఎత్తున బందోవస్తు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 150 మంది వివిధ స్థాయి పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తుకు చర్యలు చేపట్టినట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

డీఐజీకి ఎస్పీ శుభాకాంక్షలు



డీఐజీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ, ఏఎస్పీ

నంద్యాల క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు గురువారం కర్నూలు రేంజ్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆలోచింపజేసిన చిగురు మేఘం

- ఆకట్టుకున్న 'ఇది ఇతని సంతకం కాదు'
- రెండో రోజు రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు

6లో



చిగురుమేఘం సాంఘిక నాటిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

5న యువతకు పోటీలు

నంద్యాల కల్చరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో 5వ తేదీ యువజన సర్వీసుల శాఖ-సెట్కూరు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ నంద్యాల బ్రాంచి సహకారంతో జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వహణాధికారి దీప్తి తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ఈ పోటీలలో 15 నుంచి 29 సంవత్సరాల వయసు కలిగిన యువత పాల్గొనవచ్చని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఆత్మకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఆత్మకూరు ప్రాంతానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఓవైపు నల్లమల అడవుల అందాలు.. మరోవైపు కృష్ణమ్మ పరవళ్లు.. చెంతనే కొలనుభారతి క్షేత్రంలోని సరస్వతీ అమ్మవారి చల్లని ఆశీస్సులు కలగలిసిన ఆత్మకూరులో ఒకప్పుడు ఇంటర్మీడియట్ విద్యను చదవాలంటే సాహసం చేయాల్సిందే. ఆ పరిస్థితుల్లో ఎంతో మంది కృషి ఫలితంగా 1974లో ఆత్మకూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైంది. నాటి నుంచి నేటి వరకు యాభై ఏళ్ల ప్రస్థానంలో ఈ కళాశాలలో వేలాది విద్యా కుసుమాలు వికసించాయి. వీరిలో ఎంతో మంది దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడి సమాజంలో అత్యున్నత స్థాయిలో నిలిచారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 50 వసంతాలను పూర్తి చేసుకున్న శుభసందర్భంగా కళాశాల పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు స్వర్ణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. జనవరి 4, 5 తేదీల్లో ఈ వేడుకలను అద్భుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల



తరగతి గదిలో..

పూరి గుడిసెల్లో మొదలై...

ఆత్మకూరులో 1974లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైన సందర్భంలో రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉండేవి. వాటిని ప్రిన్సిపాల్, ఆఫీసు కార్యకలాపాలకు వినియోగించేవారు. తరగతులను మాత్రం గుడిసెల్లోనే నిర్వహించేవారు. ఈ గుడిసెల్లో విద్యాబోధన కష్టతరంగా ఉండటంతో పాఠశాలలోని ఒకటి, రెండు గదులను వాడుకునేవారు. ఈక్రమంలోనే 1977 నవంబరులో దివిసీమలో సంభవించిన ఉప్పెన విపత్తు సందర్భంలో ఆత్మకూరులో కూడా భారీ వర్షాలు కురిసి జూనియర్ కళాశాల గుడిసెలన్నీ దెబ్బతిన్నాయి. 1978లో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యే ఎన్నికై రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా వ్యవహరించిన కొక్కెరంచ వెంగళరెడ్డి కళాశాల గుడిసెలు దెబ్బతిన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విపత్తు నిధుల్లో భాగంగానే తరగతి భవనాల నిర్మాణాల కొరకు రూ.3లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ తరగతి గదులను ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంపై నిర్మించాల్సి ఉండగా అందుకు రూ.5లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉండటంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో వెన్నా రామకృష్ణారెడ్డినే తన సొంత నిధులను కలిపి 12 తరగతులతో పాటు ఆఫీసు, స్టోర్‌రూమ్‌లను నిర్మించారు.

1974... రూ.లక్ష చందాలు వేసుకుని...

ఆత్మకూరుతో పాటు చుట్టుపక్కల ఉన్న వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాలల్లోని వారికి ఒకప్పుడు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించాలంటే ఎంతో వ్యయప్రయాసలు భరాయించాల్సి ఉండేది. స్థానికంగా ఇంటర్ కళాశాల లేకపోవడం వల్ల కర్నూలు, నంద్యాల, మార్కాపురం, నందికొట్కూరుకు వెళ్లాల్సి వచ్చేది. అప్పట్లో పెద్దగా రవాణా, హాస్టల్స్ వసతి లేకపోవడంతో నానా అగచాట్లు పడేవారు. ఒక విధంగా సామాన్యులకు ఇంటర్ విద్య కొంత భారంగానే ఉండేది. ఈ ఇబ్బందులు పడలేక మరికొందరైతే ఏకంగా చదువే మానేయాల్సి పరిస్థితులు ఉండేవి. దీంతో ఆత్మకూరులో జూనియర్ కళాశాల ఆవశ్యకత అందరిని కలిచి వేసింది. ఎలాగైనా జూనియర్ కళాశాలను తీసుకురావాలన్న తలంపుతో అన్ని మండలాల్లోని పలువురు పెద్దలు సమస్యను రాజకీయ నాయకుల చొరవతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే రూ.లక్ష ప్రభుత్వానికి డిపాజిట్ చెల్లిస్తే కళాశాల ఏర్పాటు జరిగే అవకాశం ఉందన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. దీంతో ఆత్మకూరు ప్రాంతానికి చెందిన వెన్నా రామకృష్ణారెడ్డి, కడుమూరి మాసుంసా, మోమిన్ అహ్మద్‌హుసేన్, మోమిన్ నద్దిముల్లా, దుద్యాల నాగలక్ష్మీరెడ్డి, చెంచిరెడ్డి మరికొంత మంది పెద్దలు కలిసి ఇంటింటికి వెళ్లి చందాలు సేకరించి ప్రభుత్వానికి లక్ష రూపాయలను డిపాజిట్ చేశారు. దీంతో అనేక ఒడిదుడుకుల మధ్య ఎట్టకేలకు 1974లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోనే జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు.

స్వర్ణోత్సవాల వేళ...

- స్వర్ణోత్సవాలకు సిద్ధమైన ఆత్మకూరు జూనియర్ కళాశాల
- అనేక ఒడిదుడుకుల నడుమ 1974లో ఏర్పాటు
- 50ఏళ్ల ప్రస్థానంలో వేలాదిగా వికసించిన విద్యా కుసుమాలు
- 4,5 తేదీలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటై 50ఏళ్లను పురస్కరించుకుని కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులతో భారీ ఆత్మీయ సమ్మేళనానికి శ్రీకారం చుట్టారు. జనవరి 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుక అంబరాన్ని తాకేలా ప్లాన్ చేశారు. స్వర్ణోత్సవాల సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకలకు న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఇంటర్ బోర్డు కమిషనర్ క్రిత్తికా శుక్లా, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ ఆధిరాజ్‌సింగ్ రాణా, కడప ఆర్‌జేడీ రవి హాజరు కానున్నారు.

ఫస్ట్ బ్యాచ్ ఇలా..

ఆత్మకూరులో 1974లో ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలుత సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించి 1974-76 బ్యాచ్‌లో 148 విద్యార్థులు ఉన్నారు. కళాశాల ఏర్పాటు సమయంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా ఆ తర్వాత మొట్టమొదటి ప్రిన్సిపల్‌గా గరిమెల్లి సీతారామయ్య, అధ్యాపకులుగా సీఎస్.కుమార్ (బాటనీ, జువాలజీ), మనోహర్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ), హుసేన్ (ఇంగ్లీష్), శేషఫణి శర్మ(తెలుగు), గోపాలకృష్ణ (కామర్స్), గరుడయ్యనాయుడు (జువాలజీ), రామయ్య(కామర్స్), సత్యనారాయణమూర్తి (ఎకనామిక్స్), సుదర్శన్ (జువాలజీ) ఉన్నారు. వీరిలో సీఎస్.కుమారు, సుదర్శన్ మినహా వారందరు మృతిచెందారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల తొలి బ్యాచ్ అధ్యాపకులు(ఫైల్)



ప్రభుత్వ జూనియర్ కళాశాల తొలి బ్యాచ్ (1974-76) విద్యార్థులు

పూర్వ విద్యార్థుల్లో ప్రముఖులు..

ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గడిచిన 50ఏళ్లలో సుమారు 20వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసించగా వీరిలో ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో నిలిచారు. ప్రత్యేకించి ఇక్కడ చదివిన ఎం.జగన్నాథం ఐఏఎస్ కేడర్ హోదాలో పనిచేయగా శంకరశర్మ (ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యుడు), వీరబ్రహ్మం (డీఆర్‌డీఏ శాస్త్రవేత్త), ప్రకాష్‌రెడ్డి (హైకోర్టు అడ్వకేట్), విజయభాస్కర్ (ఎస్వీ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్, నెల్లూరు), మృత్యుంజయరెడ్డి (ఇస్రో-శాస్త్రవేత్త), దివాకర్ (ప్రొఫెసర్ పాండిచ్చేరి), మునీశ్వరయ్య (ఇండియన్ బ్యాంకు మేనేజర్), ఎస్వీ ప్రసాద్, మల్లారెడ్డి (ఏపీజీబీ రిటైర్డు బ్యాంకు మేనేజర్లు), ఉమామహేశ్వరరెడ్డి (ఏడీ-అగ్రికల్చర్), ఏవీ నారాయణరెడ్డి (పారిశ్రామికవేత్త) ఉన్నారు. వీరేకాక మరెంతో మంది వివిధ రంగాల్లో అత్యున్నత స్థాయిల్లో స్థిరపడ్డారు.

స్వర్ణోత్సవాలను విజయవంతం చేద్దాం



ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటై 50ఏళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వేడుకలను విజయవంతం చేసేందుకు పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు, సామాజికవేత్తలు భాగస్వాములు కావాలని ఆశిస్తున్నాము. అందరి సహకారంతో ఇప్పటికే వేడుకల ఏర్పాట్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేశాము.

- రఘురామాచార్యులు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

అదృష్టంగా భావిస్తున్నాము



ఆత్మకూరు ప్రాంతంలో ఇంటర్మీడియట్ కళాశాల లేనప్పుడు ఇంటర్ విద్య కోసం ఇక్కడి విద్యార్థులు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. ఆ సమయంలో మా తండ్రి వెన్నా రామకృష్ణారెడ్డితో పాటు ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాలకు చెందిన పలువురు ప్రముఖుల కృషి ఫలితంగా అనేక ఒడిదుడుకుల నడుమ 50ఏళ్ల క్రితం కళాశాల ఏర్పాటు సాధ్యమైంది. అప్పటి నుంచి నేటి వరకు వేలాది మందికి విద్యాబుద్ధులు నేర్పిన కళాశాల స్వర్ణోత్సవాలు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉంది.

- వెన్నా భోగిరెడ్డి, పూర్వ విద్యార్థి, ఆత్మకూరు

చాలా ఆనందంగా ఉంది



విద్యాబుద్ధులు ప్రసాదించిన కళాశాల దిగ్విజయంగా 50ఏళ్లను పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి అద్భుత ఘట్టంలో తాను భాగస్వామ్యున్ని కావడం మరచిపోలే స్మృతిగా భావిస్తున్నాను. ఇప్పటికే ఎంతో మంది పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించడం కూడా సంతోషించదగ్గ విషయం.

- సాజిద్‌బాషా, పూర్వ విద్యార్థి, సీనియర్ అకౌంటెంట్, ఆత్మకూరు సబ్‌ట్రెజరీ

మార్కెట్ పాలనాధీశులు ఎవరు?

(5వ పేజీ తరువాయి)

రిజర్వేషన్ల ఖరారుపై ఆరోపణలు

నంద్యాల జిల్లాలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనలు పాటించలేదనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల సిఫారసుల మేరకు రిజర్వేషన్లు ఖరారు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నంద్యాల జిల్లాలో నందికొట్కూరు, ఆత్మకూరు, కోవెలకుంట్ల, బనగానపల్లె మార్కెట్ కమిటీలు ఓసీ (జనరల్), నంద్యాల ఓసీ (మహిళ)కు కేటాయిస్తే.. ఆళ్లగడ్డ ఎస్సీ (మహిళ), డోన్, పాణ్యం బీసీ (మహిళ)కు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీలకు 21 శాతం రిజర్వేషన్ ప్రకారం రెండు మార్కెట్ కమిటీలు కేటాయించాల్సి ఉంది. ఎస్టీ రిజర్వేషన్‌ను పరిగణలోకి తీసుకోకుండా ఎస్సీ రిజర్వేషన్ మాత్రమే పరిగణలోకి తీసుకుని ఎస్సీలకు ఆళ్లగడ్డ చైర్మన్ రిజర్వేషన్ కల్పించి మహిళలకు కేటాయించారు. బీసీలకు రెండు రావాల్సి ఉంటే.. ఆ రెండు స్థానాలు మహిళలకు కేటాయించారు. వాస్తవంగా అయితే ఒకటి జనరల్, ఒకటి మహిళలకు ఇవ్వాలి. ఓపన్ కేటగిరి (ఓసీ) కింద నాలుగు మార్కెట్ల చైర్మన్ స్థానాలు కేటాయించాల్సి ఉంటే ఐదు మార్కెట్లు కేటాయించారు. అందులో మహిళలకు సగం అంటే.. కనీసం రెండు చైర్మన్ పదవులు ఇవ్వాల్సి ఉండగా ఒక స్థానంతో సరిపుచ్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆశావహుల ప్రయత్నాలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు టీడీపీ నాయకులు అప్పటి నేతల వేధింపులతో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అక్రమ కేసులు ఎదుర్కొన్నారు. ప్రతిపక్షంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన నాయకులు ఎందరో ఉన్నారు. మార్కెట్ యార్డు పదవుల పందేరంలో తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు. కర్నూలు మార్కెట్ పీఠం కోసం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన ఆర్.చంద్రకళాధర్‌రెడ్డి పేరును పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు ప్రతిపాదించినట్లు సమాచారం. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గోనేగండ్ల మండలం పెద్దనెలటూరు గ్రామానికి చెందిన కురువ మల్లయ్య, వైస్ చైర్మన్‌గా నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన ఖాసీంవల్లి పేర్లు ఖారరు చేసినట్లు సమాచారం. పత్తికొండ మార్కెట్ చైర్మన్ పదవికి కృష్ణగిరి మండలానికి చెందిన నబీసాహెబ్ పేరు ఎంపిక చేశారని తెలుస్తుంది. ఆలూరు పీఠం కోసం ఆరేడుగురు పోటీ పడుతున్నా.. రాజారత్నం, నర్సప్ప, శేషగిరి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇక ఆదోని రాయలసీమలోనే అతిపెద్ద మార్కెట్‌గా గుర్తింపు ఉంది. ఈ పీఠం బీసీ/మైనార్టీ మహిళకు కేటాయించారు. ఈ పీఠం కోసం కూటమి పార్టీల్లో తీవ్ర పోటీ ఉంది. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప భార్యకు ఆ స్థానం కేటాయించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పొత్తుల్లో భాగంగా తమకే వస్తుందని ఆశాభావంతో ఉన్నారు. అదే క్రమంలో మైనార్టీ కోటాలో టీడీపీ మైనార్టీ నాయకుడు ఉమ్మి సలీం, బీసీ వాల్మీకి కోటాలో టీడీపీ సీనియర్ నాయకుడు ఆరేకల్లు రామకృష్ణలు ప్రయత్నాలు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో కూడా చైర్మన్ పదవుల కోసం ఆశావహులు ఎమ్మెల్యేలను కలసి ప్రయత్నాలు షురూ చేశారు. ఉమ్మడి జిల్లాలో రెండు మూడు నియోజకవర్గాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు ఐదేళ్లు వైసీపీలో పార్టీ బలోపేతం కోసం కష్టపడిన కార్యకర్తలను కాదని ఎన్నికల ముందు, ఆ తరువాత టీడీపీలో చేరిన వారినే చైర్మన్‌గా ఎంపిక చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం విచారించి పార్టీ కోసం కష్టపడ్డ వారికే ప్రాధాన్యత ఇవ్వాలని టీడీపీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

మార్కెట్ కమిటీ చైర్మన్ల రిజర్వేషన్ల వివరాలు

మార్కెట్ కమిటీ	రిజర్వేషన్
కర్నూలు జిల్లా	
కర్నూలు	ఓసీ జనరల్
ఆదోని	బీసీ/మైనార్టీ (మహిళ)
కోడుమూరు	ఓసీ (మహిళ)
మంత్రాలయం	ఓసీ (మహిళ)
ఎమ్మిగనూరు	బీసీ/మైనార్టీ జనరల్
ఆలూరు	ఎస్సీ -జనరల్
పత్తికొండ	ఓసీ జనరల్
నంద్యాల జిల్లా:	
నంద్యాల	ఓసీ (మహిళ)
ఆళ్లగడ్డ	ఎస్సీ (మహిళ)
డోన్	బీసీ (మహిళ)
నందికొట్కూరు	ఓసీ జనరల్
ఆత్మకూరు	ఓసీ జనరల్
బనగానపల్లె	ఓసీ జనరల్
కోవెలకుంట్ల	ఓసీ జనరల్
పాణ్యం	బీసీ (మహిళ)

ఆలోచింపజేసిన చిగురు మేఘం

- ఆకట్టుకున్న 'ఇది ఇతని సంతకం కాదు'
- రెండో రోజు రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు



కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును సత్కరించిన కళాకారులు

కర్నూలు కల్చరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైద్యులు పల్లెల నుంచి ఎదిగి, నగరాల్లో కార్పొరేట్ ఆసుపత్రులు పెట్టి ధన సంపాదనే ముఖ్యమై పేదల వైద్య సేవలు మర్చిపోతున్నారనే ఇతివృత్తంతో సాగిన 'చిగురు మేఘం' నాటిక ఆలోచింపజేసింది. 'ఇది ఇతని సంతకం కాదు' అన్న మరో నాటిక ఆద్యంతం ఆకట్టుకుంది. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో రెండో రోజు గురువారం రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు కొనసాగాయి. హైదరాబాదు మహతీ క్రియేషన్స్, కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ నాటిక ప్రదర్శనలను సినీ నటులు సుబ్బరాయ శర్మ, గోపరాజు రమణ, కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిష్ణాతులైన కళాకారులు తమ నాటికల ద్వారా ప్రేక్షకులకు వినోదాన్ని పంచడం ప్రశంసనీయమని అన్నారు. నాటకం సజీవమైనదని, దాన్ని ప్రాణపదంగా చూసుకోవడం కళాకారులకు ఒక పరీక్ష వంటిదని అన్నారు. కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలు ఇవ్వడం ఒక ప్రత్యేక సందర్భంగా నిలుస్తోందని చెప్పారు. కళాకారులకు తనవంతు చేయూత అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సన్మాన గ్రహీత, సినీ టీవీ రంగస్థల నటుడు గోపరాజు రమణ మాట్లాడుతూ 1995 నుంచీ నాటక రంగంతో అనుబంధం ఉందని, అనంతరం టీవీ, సినిమాల్లో రావడానికి సుబ్బరాయశర్మ సహకారం మర్చిపోనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీ బస్తిపాటి నాగరాజును కళాకారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, వ్యాఖ్యాత ఇనాయతుల్లా, శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, వి.రాముడు, హార్మోనిస్ట్ పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను అలరించిన నాటక ప్రదర్శనలు...

నాటకోత్సవాల్లో రెండో రోజు గురువారం రాత్రి ప్రదర్శించిన రెండు నాటికలు వేటికవే పోటీగా నిలిచాయి. తొలుత గుంటూరు అమరావతి ఆర్ట్స్ సంస్థ వారి 'చిరుగు మేఘం' ప్రదర్శించారు. కావూరి సత్యనారాయణ రచించిన ఈ నాటకానికి పప్పూరి హరిబాబు దర్శకత్వం వహించారు. స్వయంగా పేదలైన తల్లిదండ్రులే కార్పొరేట్ ఆసుపత్రులకు వస్తే వారిని ఏ విధంగా ఇబ్బందులకు గురిచేసిందీ ఈ నాటిక తెలియజేస్తుంది. కార్పొరేట్ నుంచీ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి సేవలు చేసిన వైద్యుల జీవితం ధన్యం అనే సందేశంతో ఈ నాటకం పూర్తవుతుంది. ఇందులో వివిధ పాత్రల్లో ఏపూరి హరిబాబు, కోనపరెడ్డి మస్తాన్‌రావు, సరిత, కావూరి సత్యనారాయణ, నాగరాణి, ప్రసాద్, రాజశేఖర్‌లు నటించారు. రెండో నాటికగా గుంటూరు అభినయ ఆర్ట్స్ సంస్థ వారు 'ఇది ఇతని సంతకం కాదు' ప్రదర్శించారు. ఈ నాటికను స్నిగ్ధ రాయగా రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించారు. ప్రతి మనిషికి ఒక బలమైన లక్ష్యం, అందుకు తగిన ప్రణాళిక ఉండాలని అది లేని జీవితం వ్యర్థమని ప్రబోధిస్తుంది. సిద్ధాంతాలకు కట్టుబడి సాగించే జీవితం నిజమైన జీవితమని ఈ నాటిక తెలియజేస్తుంది.

అయ్యయ్యో... పాలపిట్ట..!

అశ్వీనీ మాసంలో అడుగుపెట్టి.. శుక్ల పక్షంలో శోభనిచ్చి.. పంట చేనుల్లో పరుగులెడుతూ... విజయదశమికి విజయాలనిస్తుంది పాలపిట్ట. చూసేందుకు చూడచక్కని రంగులతో పసిడి పరువాల విహంగ అద్భుతాల పాలపిట్ట విలవిల్లాడి మృతి చెందిన ఘటన కోసిగి మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం చోటు చేసుకుంది. ఓ పాలపిట్ట విద్యుత్ వైరులో తల ఇరుకుని తల్లడిల్లుతూ ప్రాణం కోల్పోయింది. మిగతా పక్షులు అక్కడకు చేరుకుని పాలపిట్టను లేపే ప్రయత్నం చేయగా.. బలంగా వైరులో ఇరుక్కుపోవడంతో మృతి చెందింది. స్థానిక వీఆర్వో బలరాముడు, హనుమంతు విద్యుత్ వైరులో ఇరుకుని మృతి చెందిన పాలపిట్టను బయటకు తీసి పక్కనే ఉన్న వాగు దగ్గర పాతిపెట్టారు.

- కోసిగి (ఆంధ్రజ్యోతి)





వైరుకు వేలాడుతున్న పాలపిట్ట



7న సెపక్ తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో ఆలూరులోని కేవీకే ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికలకు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు. 01.01.2005లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. జిల్లాకు ఈ నెల 17, 18 తేదీల్లో ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగే 28వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాల కోసం 9440257242ను సంప్రదించాలన్నారు.

జిల్లా అభివృద్ధికి కష్టపడి పనిచేద్దాం



కలెక్టర్‌తో జేసీ, డీఆర్వో, అధికారులు, సిబ్బంది

కర్నూలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో కర్నూలు జిల్లా అభివృద్ధికి సమష్టిగా కష్టపడి పని చేద్దామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులకు పిలుపునిచ్చారు. ఆంగ్ల నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జేసీ నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి, సమష్టిగా పని చేద్దామని అన్నారు. క్యాంపు కార్యాలయంలో జేసీ నవ్యను అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రపంచం మెచ్చిన నేత మన్మోహన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ

కర్నూలు అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచదేశాలు మెచ్చిన మహానాయకుడు మన్మోహన్ సింగ్ అని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. దేశానికి నీతి వంతమైన పాలన అందించిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అన్నారు. భారత్, పాక్ రెండు దేశాలు సంతాప దినాలు ప్రకటించాయన్నారు. ఉపాధి హామీ పథకం ఆయన ఆలోచనల్లో నుంచి పుట్టిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుదాకర్ బాబు, నగర అధ్యక్షుడు జిలానీ బాషా, బి.బ్రతుకన్న, అనంతరత్నం, దామోదరం రాధాకృష్ణ, మల్లీశ్వరి, శ్రీలత, ప్రమీల త పాల్గొన్నారు

పోలీస్ స్టేషన్‌కు భూముల వివాదం


పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్థులు

ఆలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి) మండలంలోని మొలగవల్లి గ్రామంలోని మాణిక్య ప్రభు ఆలయ భూముల వ్యవహారం గురువారం పోలీసు స్టేషన్‌కు చేరింది. ఎన్నో ఏళ్లుగా 60 ఎకరాల ఆలయ భూములను రాఘవయ్య, మురళి స్వామి ఏడాదికి ఒకరు ప్రకారం సాగుచేసుకుంటున్నారు. కాగా రాఘవయ్య కుటుంబ సభ్యులు ఆలయ ట్రస్టుకు మార్చుకుని మీకు సంబంధం లేదని మురళి స్వామి కుటుంబీకులకు చెప్పారు. దీంతో మురళి స్వామి పోలీసులకు ఫిర్యాదు చేయగా బంధువు శ్రీధర్ వెంట ఉన్నారు ఎస్ఐ దిలీప్ కుమార్ శ్రీధర్‌ను గట్టిగా మందలించడంతో కుటుంబసభ్యులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ససేమీరా అన్నారు. చివరకు గతంలో మాదిరిగానే ఏడాదికి ఒక్కరు చొప్పున భూమిని సాగు చేసుకోవాలని నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

నంద్యాలలో తొలి బ్యాటరీ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టు



- గత టీడీపీ ప్రభుత్వంలో పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టు
- తాజాగా సోలార్, విండ్ బ్యాటరీ స్టోరేజీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు
- కొలిమిగుండ్ల మండలంలో ఏర్పాటు చేసే అవకాశం
- హోసూరు, పెద్దహుల్తి మధ్య సోలార్ యూనిట్
- రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

కర్నూలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం పాణ్యం మండలం పిన్నాపురం, ఓర్వకల్లు మండలం గుమ్మటంతాండ గ్రామాల మధ్య సోలార్, విండ్, హైడ్రో ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక (రెన్యూవబుల్) ఎనర్జీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు (ఐఆర్ఈపీ)కు శ్రీకారం చుడితే ఇది సాధ్యమేనా..? అంటూ పలువురు ప్రశ్నించారు. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు ఎక్కడా వినలేదు అన్నారు. ఆనాడు చంద్రబాబు ఆలోచన నుంచి పురుడుపోసుకున్న 5,230 మెగా వాట్లా సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు మార్చి నెలలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమవుతోంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా సోలార్, విండ్ బ్యాటరీ స్టోరేజీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టును నంద్యాల, కడప జిల్లాల్లో ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది.

గురువారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండలంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. నంద్యాల, కడప జిల్లాల్లో క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ త్రీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 119 మెగావాట్ల పవన విద్యుత్, 130 మెగావాట్ల సోలార్ హైబ్రిడ్ ఇంధనంతో పాటు బ్యాటరీ ఇంధనం స్టోరేజీ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే. కర్నూలు జిల్లాలో పత్తికొండ మండలం హోసూరు, పెద్దహుల్తి గ్రామాల మధ్య 400 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపుగా రూ.2 వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. 1.380 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

స్టాఫ్ నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్

- జోన్-4లో 150 పోస్టులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ కడప జోన్-4 పరిధిలో 150 కాంట్రాక్టు స్టాఫ్ నర్సు ఉద్యోగుల పోస్టుల భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి. రామగిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుల దరఖాస్తు నమూనా, వివరాలను Http://cfw.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను వెబసైట్ నుంచి డౌన్‌లోడు చేసుకుని భర్తీ చేసిన దరఖాస్తుతో పాటు నిర్దేశించిన దరఖాస్తు రుసుం, సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి ఈ నెల 3వ తేదీ నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను రీజనల్ డైరెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం కడపలో అందజేయాలని కోరారు. నిర్దేశించిన గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను తీసుకోమని తెలిపారు.

లైబ్రేరియన్‌ను శిక్షించాలి

- రోడ్డుపై విద్యార్థి సంఘాలు, విద్యార్థినుల బైఠాయింపు
- నిందితుడి అరెస్టు


పోలీసులతో మాట్లాడుతున్న నాయకులు, విద్యార్థినులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన లైబ్రేరియన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల నాయకులు, కళాశాల విద్యార్థినిలు ఆందోళనకు దిగారు. గురువారం బనవాసి ఫారంలోని ఆదోని రహదారిపై బైఠాయించారు. లైబ్రేరియన్‌ను తొలగించాలని, అరెస్టుచేసి శిక్షించాలని, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. రెండు నెలలుగా లైబ్రేరియన్ వేధింపులకు పాల్పడుతున్నా చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు తెలిపేవరకు గోప్యంగా ఉంచడం దారుణమన్నారు. కళాశాల అధికారుల ఉదాసీనతవైఖరి వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లైబ్రేరియన్‌ను విధుల నుంచి తొలగించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎస్ఐ శ్రీనివాసులు నిందితుడిని శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వీరేష్‌యాదవ్, మహేంద్ర బాబు, రాజేష్, ఉదయ్, రాఘవేంద్ర, విజయేంద్ర, షాహిద్ అఫ్రిది పాల్గొన్నారు.

నిందితుడిపై పోక్సో కేసు నమోదు

బాధితురాలు, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు లైబ్రేరియన్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. కేసు నమోదు చేశాని డీఎస్పీ, సీఐ ఆదేశాల మేరకు అరెస్టు చేసినట్లు తెలిపారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ఎమ్మిగనూరు: బనవాసి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్తాను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. విద్యార్థినిపై లైబ్రేరియన్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనకు బాధ్యుడిని చేస్తూ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఏపీఆర్ఈఐ సొసైటీ సెక్రటరీ మస్తానయ్య ఆదేశాలు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి


రామగోవిందు, వరలక్ష్మి (ఫైల్)

కోడుమూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు-ప్యాలకుర్తి గ్రామాల మధ్య గురువారం సాయంత్రం కారు- బైక్ ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు. కోడుమూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న రామగోవిందు (56), భార్య వరలక్ష్మి (50) బైక్ మీద కర్నూలు ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తూరు దాటాక నంద్యాల వెళుతున్న కారు ఢీకొట్టింది. బైక్ మీద ఉన్న దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు చేరుకుని మృతదేహాలను కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామగోవిందు, వరలక్ష్మి దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు.

బోరుబావిలో పేలుడు

- ముగ్గురికి గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు చంద్ర

ఆదోని, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బోరుబావిలో భారీ శబ్దంతో పేలుడు సంభవించి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదోని మండలం చిన్న పెండేకల్లు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కురువ చంద్ర అనే రైతు తన పొలంలో నెల రోజుల క్రితం 250 అడుగుల లోతు వరకు బోరు వేయించాడు. గురువారం బోరు బావికి పైపులు, మోటార్‌ను అమర్చేందుకు వెళ్లాడు. పక్క పొలంలో ఉన్న జయరాముడు సహాయంతో చంద్ర, అతని భార్య బసమ్మ కలిసి మోటార్‌ను బోరు బావులోకి దించారు. మోటారు బోరులో ఉన్న నీళ్లలోకి పూర్తిగా దిగకపోవడంతో బలవంతంగా దించారు. ఇంతలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. బోరు దగ్గర ఉన్న ఈ ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కల పొలంలో పనిచేస్తున్న వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం డాక్టర్ల సూచన మేరకు బంధువులు కర్నూలుకు తీసుకెళ్లారు.

పేలుడు ఎలా వచ్చింది?

బోరుబావిలో దించిన మోటారు పేలడంతో శబ్దం వచ్చిందా? లేక గిట్టని వాళ్లు ఏదైనా పేలుడు పదార్థాన్ని బోరు బావిలో వేశారా? అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

నగర పాలక సంస్థలో ఏసీ మాయం

- స్పందించని అధికారులు


ఏసీ ఎత్తుకెళ్లడంతో మిగిలి ఉన్న తీగెలు

కర్నూలు న్యూసిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలోని జనన, మరణ ధృవీకరణపత్రాల జారీ విభాగంలో ఎయిర్ కండీషనర్ మాయం అయింది. ఎవ్వరు తీసుకెళ్లారో కూడ అర్థం కావడం లేదు. కార్యాలయానికి బయటి వైపు ఏర్పాటు చేసిన రెండు ఏసీలలో ఒకటి కనిపించకుండాపోయింది. కేవలం వైర్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇది జరిగి వారం రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేస్తే ఏసీని మాయం చేసిన దొంగ దొరికిపోతాడు. కానీ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగే ఈ పని చేసి ఉంటాడని, అతను బైట పడటం ఇష్టం లేక అధికారులు ఫిర్యాదు చేయడం లేదని కొందరు భావిస్తున్నారు. పైగా ఆ ఉద్యోగి కీలక అధికారి వద్ద పని చేస్తుండటంతో కేసు నమోదు చేయడం లేదని ప్రచారం అవుతోంది.

కేసు నమోదుకు ఆదేశాలు

కార్యాలయం బయట ఉన్న ఎయిర్ కండీషనర్ మాయమైనట్లు తెలిసింది. దీన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సెక్యూరిటీ గార్డుల పనితీరు మెరుగుపరుచుకోవాలని అన్నారు. **-డాక్టర్ కే. విశ్వేశ్వరరెడ్డి, ఆరోగ్య అధికారి, నగర పాలక సంస్థ**

వరి ధాన్యం కొనేదెన్నడు?

● ఆత్మకూరు డివిజన్‌లో ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు ● తక్కువ ధరకు కొంటున్న దళారులు ● తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు


వరి ధాన్యం బస్తాలు

కొత్తపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వరికి మద్దతు ధర లేకపోవడంతో అన్నదాత దిగులు చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కొత్తపల్లి మండలంలో రైతులు చెరువులు, బావుల కింద సుమారు 1100 హెక్టార్లలో వరి సాగు చేశారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో అతివృష్టి కారణంతో వరి పంట నేలవాలి దెబ్బతిన్నాయి. ఎకరాకు 40 బస్తాలు రావాల్సిన వరి ధాన్యం కేవలం 30 బస్తాలు కూడా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. అరకొరగా పండిన వరిధాన్యానికి కూడా ఈ ఏడాది సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. పంటల కోసం చేసిన అప్పులు కూడా ఎలా తీర్చాలోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది కర్నూలు సోనా మసూరి వరి ధాన్యం 75 కేజీల బస్తా సుమారు రూ.2,500 ఉండగా.. ఈ ఏడాది కేవలం రూ.1,620 మాత్రమే ఉంది. అలాగే ఎంటీయూ 1262 రకం వరి ధాన్యం గత ఏడాది 75 కేజీలు రూ.1850 ఉండగా... ప్రస్తుతం కేవలం రూ.1,300 మాత్రమే పలికింది. దీంతో దళారులు రైతుల అవసరాలను ఆసరగా చేసుకుని ధాన్యాన్ని


ధాన్యం బస్తాలను లారీలోకి లోడ్ చేస్తున్న దృశ్యం

కొనుగోలు చేస్తూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర వరి ధాన్యం క్వింటం రూ.2,225 కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆత్మకూరు వ్యవసాయశాఖ సంచాలకుడు ఆంజనేయను వివరణ కోరగా.. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఈ ఏడాది చెరువు కింద 8 ఎకరాల్లో సోనామసూరి సాగు చేశా. మొత్తం 238 బస్తాల దిగుబడి వచ్చింది. 75 కేజీల బస్తా రూ.1620 చొప్పున 140 బస్తాలను దళారులకు విక్రయించాను. మిగిలిన ధాన్యాన్ని ధర పెరిగిన తర్వాత విక్రయిస్తా.

- రామచంద్రారెడ్డి, రైతు, వీరాపురం

ఐదెకరాల్లో సాగు చేశాను



ఐదెకరాల్లో సాగు చేశాను. 160 బస్తాల దిగుబడి వచ్చింది. దళారులు తక్కువ ధరకు కొంటున్నారు. అందువల్ల ధాన్యాన్ని అమ్ముకోలేదు. మంచి ధర వచ్చినప్పుడు విక్రయిస్తాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- చిన్న పుల్లారెడ్డి, రైతు, లింగాపురం

దళారి వ్యవస్థను అరికట్టాలి



16 ఎకరాల్లో కర్నూలు సోనా, ఎంటీయూ 1262 రకం వరి సాగు చేశాను. ఎంటీయూ 1262 రకం 370 బస్తాల దిగుబడి రాగా అన్ని బస్తాలను రూ.1300 చొప్పున విక్రయించాను. సోనా బియ్యం ఇంకా విక్రయించలేదు. ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యాన్ని నేరుగా సేకరించి మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. దళారి వ్యవస్థ లేకుండా చర్యలు తీసుకోవాలి.

- రమణారెడ్డి, రైతు, వీరాపురం

డీఐజీకి ప్రముఖుల శుభాకాంక్షలు


డీఐజీ కోయ ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జయసూర్య, శివానందరెడ్డి

నందికొట్కూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్‌కు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఐజీని ఎమ్మెల్యే, మాండ్ర శాలువాతో సన్మానించారు. వీరి వెంట మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి, రమేష్‌రెడ్డి ఉన్నారు.

'ఈపీఎఫ్ జమ చేయాలి'

ఆత్మకూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు 2016 నుంచి 20198 వరకు చెల్లించాల్సిన ఈపీఎఫ్ బకాయిలను కార్మికుల ఖాతాల్లోకి జమ చేయాలని ఏఐటీయూసీ తాలుకా నాయకులు టి.ప్రతాప్, కన్వీనర్ బీసన్న డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఈపీఎఫ్ బకాయిలతో పాటు ఈఎస్ఐ వర్తింపు కూడా సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. కాగా గత ఏడాది మార్చి నెలల్లో 20 మంది కార్మికులకు రూ.6వేల వేతనం తగ్గించి ఇచ్చారని, అయితే దానిపై ఇంతవరకు అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం సరికాదని తెలిపారు. అదేవిధంగా 2000లో చేరిన 11 మంది కార్మికులను కూడా అప్కాస్‌లో 2021 అని చూపించారని ఇది సవరించాలని అనేక మార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కాగా ఇప్పటివరకు 11 మంది కార్మికులు మృతిచెందారని, అయితే పీఎఫ్ పెండింగ్ ఉండటం వల్ల వారికి పీఎఫ్ నగదు అందక ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగరాజు, చిన్న నందయ్య, దానమయ్య, నరసింహుడు, దొరస్వామి, శేఖర్ తదితరులు ఉన్నారు.

'బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి'

నందికొట్కూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతుల శనగలను అక్రమంగా అమ్మేసుకున్న బీజేపీ నాయకులపై తక్షణమే చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతపురం జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు కర్నూలు జిల్లాలో వేర్ హౌస్ గోదామును అద్దెకు తీసుకున్నారని, అయితే నిల్వ చేసిన శనగలను రైతులకు తెలియకుండా అమ్ముకున్నారని అన్నారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ జిల్లా కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యులు నాయుడు, పుల్లన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత శకునాల జట్టు


విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

జూపాడుబంగ్లా, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని భాస్కరాపురం గ్రామంలో ఏబీఎం చర్చి సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 36 జట్లు పాల్గొన్నాయి. మూడురోజులుగా జరిగిన కబడ్డీ పోటీల్లో శకునాల జట్టు విజేతగా నిలిచి రూ.30వేలు కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో ప్రాతకోట జట్టు రూ. 20వేలు, మూడో స్థానంలో వడ్డెమాను రూ. 10వేలు, నాలుగో స్థానంలో ఆర్ఎస్‌రంగాపురం జట్టు రూ. 5వేలు కైవసం చేసుకుంది. 40 మంది క్రీడాకారులకు స్వామన్న, సీపీఐ నాయకులు రమేష్ ఇరువురుకలిసి టీషర్టులను అందజేశారు. గెలుపొందిన విజేతలకు సంఘం పెద్దలు నగదును అందజేశారు.

సచివాలయం తనిఖీ

పాములపాడు జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టకందాల, మద్దూరు, వాణాల గ్రామాలలోని సచివాలయాలను ఎంపీడీవో చంద్రశేఖర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సచివాలయాలలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయా పాలన పాటించాలని తెలిపారు. ఎంఎస్ఎంఈ, మిస్సింగ్ సిటిజన్ మ్యాపింగ్, ఈకేవైసీ రీ సర్వేల నివేదికను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అలాగే మద్దూరు గ్రామంలో నిర్మిస్తున్న గోకులం షెడ్లను ఉపాధి హామీ ఏపీవో విమలమ్మతో కలిసి పరిశీలించారు.

'రోడ్డు భద్రత నియమాలు పాటించాలి'


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఓబులేసు

మిడుతూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని ఎస్ఐ ఓబులేసు సూచించారు. మిడుతూరు గ్రామ సమీపంలోని బ్రహ్మంగారి మఠం వద్ద గురువారం వాహనాల తనిఖీ చేశారు. ఆయన వాహనదారులతో మాట్లాడుతూ రూట్ పరిమిట్ లేని వాహనాలు నడపరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దిచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. లైసెన్స్ లేనివారికి, రూట్ పరిమిట్‌లేని వాహనదారులకు, హెల్మెట్ లేనివారికి జరిమానాలు విధించారు. ఎస్ఐ వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'హెల్మెట్ తప్పనిసరి'

మహానంది, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి హెల్మెట్‌ను తప్పని సరిగా ఉపయోగించాలని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం మహానంది మండలం బోయలకుంట్ల క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ సిబ్బందితో కలసి వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న 20 మందికి జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులు సలాం, శేఖర్, నారాయణస్వామి, మురళి ఉన్నారు.

సఫ్దర్ హష్మీకి నివాళి


నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆత్మకూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కళాకారుడు సఫ్దర్ హష్మీ వర్ధంతి సందర్భంగా గురువారం సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఒక కార్మికుడు బతకడానికి ఎంత కావాలి అనే అంశంపై సఫ్దర్ హష్మీ రూపొందించిన వీధినాటకం స్ఫూర్తిదాయకమని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకుడు జె.చంద్రశేఖర్ అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ సినీ, టీవీ, నాటక, సాహితీరంగ ప్రముఖుడైన హష్మీ 1989 జనవరి 1వ తేదిన భావ ప్రకటన స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగం చేశారని అన్నారు. ఒక కళాకారున్ని హత్య చేస్తే వేల మంది కళాకారులు ఉద్భవిస్తారని అన్నారు. ప్రజా సంఘాల నాయకులు రణధీర్, రామ్‌నాయక్, ఇస్మాయిల్, స్వాములు, వీరన్న, రాజేష్ తదితరులు ఉన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

పాణ్యం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ ఛాలెంజ్ జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలకు శాంతిరాం విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ యువ భారతీయులను శక్తివంతం చేసే లక్ష్యంతో ఆలోచనల యొక్క డైనమిక్ మార్పిడి కోసం నాయకులు, నిర్ణయాధికారులను తీసుకువచ్చే వేదికగా ఈ పోటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. డిసెంబరు 31 న నాగార్జున యూనివర్శిటీలో జరిగిన రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ పిపచ్ డెక్ పోటీలలో కళాశాలకు చెందిన డేటా సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు ఎస్ అమీర్‌హుశేన్, ఎస్ హిమబిందు ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 11, 12 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొంటా రని చెప్పారు. విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించిన డీన్(స్టూడెంట్స్ అఫైర్) లావణ్యను, విద్యార్థులను ప్రిన్సిపాల్, హెచ్‌వోడీ రమాదేవి అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

జూపాడుబంగ్లా, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూడిచర్ల గ్రామానికి చెందిన సాంబశివుడు (27) అనే వ్యక్తి గత మూడురోజుల నుంచి కనిపించడంలేదని కుటుంబసభ్యులు జూపాడు బంగ్లా పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ట్రాక్టర్ సేద్యం చేసే విషయంలో పొలానికి వద్దు అని చెప్పడంతో అలిగి వెళ్లిపోయాడని, ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్ మృతి

పాణ్యం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాణ్యం కేజీబీవీ ప్రిన్సిపాల్ లలితకుమారి (39) గురువారం మృతి చెందారు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. గడివేముల మండలం చిందుకూరు గ్రామంలో ఆమె భౌతిక కాయానికి విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు ప్రతాప్, శివకృష్ణ, వెంకటాద్రి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా నివాళి అర్పించారు. ఎంఈవోలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, సుగాలిమెట్ట సర్పంచ్ దేవిబాయి, ఎంపీపీ ఉశేన్‌బీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ దినేష్‌బాబు, మండల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

'ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలి'


కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దానం

పాణ్యం, జనవరి (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ను రద్దు చేయాలని టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పిడతల దానం కోరారు. పాణ్యంలో ఆయన మాట్లాడుతూ కర్నూలులోని ఎస్సీ ఉపకులాల ఏకసభ్య కమిషన్ చైర్మన్ మిశ్రాకు గురువారం వినతి పత్రం అందజేశామని చెప్పారు. వర్గీకరణ రద్దు చేయాలని, ఆర్టికల్ 341 ప్రకారం సుప్రీం కోర్టు తీర్పును, క్రీమిలేయర్‌ను రద్దు చేయాలని కోరామన్నారు. రాష్ట్రంలో కులగణన చేసి, జనాభా ప్రాతిపదిక ప్రకారం23 శాతం రిజర్వేషన్‌లు పెంచాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కేజే శ్రీనివాసరావు, రాజేష్, సతీష్ పాల్గొన్నారు.

'గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి'

కొత్తపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యేసురత్నం, మండల కార్యదర్శి నక్క స్వాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ రోడ్లు పాడైపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

రైతులను నిర్లక్ష్యం చేయొద్దు: ఎమ్మెల్యే


తెలుగుగంగ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం ఆయన వెలుగోడు జలాశయానికి అనుసంధానంగా వన్‌ఆర్ తూమ్‌ను తెలుగుగంగ అధికారులతో కలిసి పరిశీలించారు. వన్‌ఆర్ తూమ్ గేటు పని చేయకపోవడంతో సాగునీటి సమస్య తలెత్తడంతో రైతులు ఎమ్మెల్యేని కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. దీంతో ఆయన స్వయంగా జలాశయం వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను అధికారులు సత్వరమే పరిష్కరించాలని అన్నారు. తూముకు సంబంధించిన ఉక్కు పిన్ను ఊడిపోవడంతో గేటు మరమ్మతులకు గురైందని గంగ అధికారులు తెలిపారు. తూము సైతం 14 అడుగుల లోతులో నీటిలో ఉండటంతో మరమ్మతులకు కష్టంగా ఉందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నిపుణులను రప్పించి మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని సూచించారు. లేనిపక్షంలో వరి నారుమళ్లు ఎండిపోయి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో అధికారులు తూము మరమ్మతుల కోసం నిపుణులను రప్పించేందుకు ప్రయత్నాలు సాగించారు. ఎమ్మెల్యే వెంట కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడు బన్నూరు రామలింగారెడ్డి, మాజీ సర్పంచ్ కలాం, నాయకులు శంకరరెడ్డి, ఎల్లాల కృష్ణుడు, రసూల్, జాకీర్‌హుసేన్, సూర్యనారాయణ, రాజశేఖర్, తెలుగుగంగ ఈఈ శంకరరెడ్డి, డీఈ బాషూజీ, జేఈ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

'విధుల్లో అప్రమత్తంగా ఉండాలి'

నంద్యాల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి); మనం చేసే విధుల్లో నిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్‌కుమార్ సూచించారు. గురువారం ఎస్ఈని పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. సంఘ అభివృద్ధి ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్ఞానసూర్యుడు, రామయ్య, కోశాదికారి సుధాకర్, డివిజన్ కార్యదర్శి నాగరాజు, ఎఈ లు పక్కీరయ్య, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి: ఏపీటీఎఫ్


మాట్లాడుతున్న నగిరి శ్రీనివాసులు

గడివేముల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కానుకగా ఉపాధ్యాయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు కోరారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మధ్యంతరభృతి, కరువు బత్యం గురించి చర్చ వస్తుందని ఎదురు చూసినా ఉపాధ్యాయ, ఉద్యోగులకు నిరాశే మిగిలిందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలైన ఇంతవరకు 12వ వేతన సవరణ సంఘానికి కమిషనర్‌ను నియమించలేదని అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డీఏల గురించి చర్చించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బిల్లు బకాయిలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మానపాటి రావి, ఆవుల మునిస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

'బేడ, బుడగ జంగాల అభివృద్ధికి పాటుపడాలి'


సంఘం పెద్దలను సత్కరిస్తున్న బుగ్గరాముడు

బండిఆత్మకూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో నేటికి చాలిచాలని బతుకులు వెల్లదీస్తున్న బేడ,బుడగ జంగాల అభివృద్ధికి పాటుపడాలని సంఘం పెద్దలను టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్ తాటికొండ బుగ్గ రాముడు కోరారు. గురువారం సాయంత్రం ఆయన మండలంలోని బరకల కాలనీలో ముందుగా సంఘపెద్దలు ధూపం జంబులు, సిరిపాటి సుంకన్న, మస్తాన్‌ను సత్కరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి బేడ, బుడగ జంగాల సమస్యలను తీసుకెళ్ళి పరిష్కారానికి తగు కృషి చేస్తానని మామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహేశ్, చిన్న మౌలాలి, జంబులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నంద్యాల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇంజనీర్స్ అసోసియేషన్ (2025) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌తో కలిసి ఎస్ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముధుశేఖర్, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, కోశాధికారి జుబేర్, కార్యదర్శి దివ్య తదితరులు పాల్గొన్నారు.

'బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి'

వెలుగోడు(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో బ్రహ్మంనాయక్ సూచించారు. గురువారం వెలుగోడు ఎంఈవో కార్యాలయంలో యూటీఎఫ్ 2025 క్యాలెండర్లను ఆ సంఘం నాయకులతో కలసి క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, జాకీరుహుస్సేన్, రామకృష్ణ, రఫి, సుబ్రమణ్యం, మజీద్, శ్రీనివాసాచారి అహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఈ మనోహర్

ప్రజా సంక్షేమానికే పథకాలు: డీపీవో

నంద్యాల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికే ప్రభుత్వ పథ కాలు అని డీపీవో జమీవుల్లా అన్నారు. చాపిరేవులలో సర్పంచ్ రాజు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు వాటి అమలు తీరుపై సమీక్షిం చారు. గ్రామానికి అవసర మైన విషయాలపై ప్రజలతో చర్చించడమే కాక వాటిని తీర్మానించారు. అంతకుముందు గ్రామా నికి చెందిన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని కలె క్టర్‌కు ఫిర్యాదు మేరకు డీపీవో విచారిం చారు. ఎంపీడీవో సుగుణశ్రీ, ఈవోఆర్డీ శివనాగజ్యోతి పాల్గొన్నారు.

బండిఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): బండి ఆత్మకూరులో గ్రామసభ సర్పంచ్ ఎరుకలి సంధ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈవోపీఆర్డీ రామకృష్ణ వేణి, కార్యదర్శి అక్బర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పార్నపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎలాంటి పరిష్కారాలు చూపటం లేదని రైతు సంఘం మండల నాయకుడు సుధాకర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు రత్నమయ్య, రాజు తహసీల్దార్ పద్మావతికి ఫిర్యాదు చేశారు.

ఆత్మకూరు రూరల్(ఆంధ్రజ్యోతి): సిద్ధపల్లి గ్రామంలో తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. డీటీ ఆంజనేయులు, ల్యాండ్ సర్వే అధికారి రాజశేఖర్, రైతు సంఘం నాయకులు బైరాపురం మహ బూబ్‌బాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా(ఆంధ్రజ్యోతి): పోతుల పాడులో గ్రామసభ సర్పంచ్ నిర్మలమ్మ అధ్యక్షతన జరిగింది. ముందుగా రెవెన్యూ సదస్సులకు సంబంధించి అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డీటీ నాగన్న, సర్వేయర్ అతీఫ్, టీడీపీ నాయకులు పల్లెశివానందరెడ్డి పాల్గొన్నారు.

గడివేముల(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూజనూరు గ్రామంలో గురువారం రెవెన్యూ సద స్సులు నిర్వహించారు. తహసీల్దార్ వెంకటరమణ, నీటి సంఘం అధ్యక్షుడు పంట రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రైతులు రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. కొరపోలూరులో గురువారం రీసర్వే అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీటీ హరికృష్ణ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల రూరల్ (ఆంధ్రజ్యోతి): కానాల గ్రామంలో రైతులు, ప్రజలకు భూ సర్వే కార్యక్రమంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రరావు, భూ సర్వే డీటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహానంది(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి మార్చి 25 వరకు మండలంలో రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. తమ్మడపల్లిలో రీ సర్వే గురించి రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పించారు.

వైభవంగా పల్లకి ఉత్సవం



మూడురాళ్లపల్లెలో వెంకటేశ్వర స్వామి ఊరేగింపు

చాగలమర్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లెలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి పల్లకి ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం, శ్రవణ నక్షత్రం సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉభయదారులు పులి చంద్ర ఓబుళరెడ్డి, మీనాక్షిదేవిచే ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సంయోజిత కన్వీనర్ భవానిదేవి, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఓబుళరెడ్డి, రామనరసింహారెడ్డి, సుదర్శన్ రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● చాగలమర్రిలోని సాయినాథ మందిరంలో గురువారం సాయి భక్తులు సాయి పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయిబాబాకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, ప్రత్యేక హారతులు, సాయి పారాయణం చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో సాయినాథుడి విగ్రహానికి అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించారు. తరలి వచ్చిన భక్తులు సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మినీ గోకులాల పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం ఏపీడీ సాంబశివరావు

చాగలమర్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ పరిధిలో మినీ గోకులాల పనులు వేగవంతం చేయాలని ఉపాధి హామీ ఏపీడీ సాంబశివరావు అన్నారు. గురువారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించా రు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, హౌసింగ్ ఏఈ నరసింహారావు, టీఏలు, కంప్యూటర్ సిబ్బంది పాల్గొన్నారు.

● **ఉయ్యాలవాడ:** ఈ ఏడాదిలో ఇచ్చిన టార్గెట్‌లను పూర్తి చేయాలని ఉపాధి ఏపీడీ సాంబశివరావు అన్నారు. గురువారం ఉపాధి సిబ్బందితో ఎంపీడీవో ఉమా మహేశ్వరరావుతో కలిసి సమావేశం అయ్యారు. కార్యక్రమంలో ఏపీవో రవిప్రకాష్ ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

బేతంచెర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం గోరుమానుకొండ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. డోన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అశోక్‌వర్ధన్ రెడ్డితో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. కంది పంట మద్దతు ధర, వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. తర్వాత బేతంచెర్ల వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించి రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం బేతంచెర్లలోని రేణుకామాతా ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఏవో కిరణ్ కుమార్, ఏఈవోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈవోలు రైతులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలి రావాలి

శిరివెళ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 5న నిర్వహించనున్న హైందవ శంఖారావానికి హిందువులంతా తరలి రావాలని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య పిలుపునిచ్చారు. మండలంలోని గోవిందపల్లెలో గురువారం ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని అన్నారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణను నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమానికి లక్షలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. హైందవ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ప్రతినిధులు నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోవెలకుంట్ల, జనవరి 2 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని అమడాలకు చెందిన ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అమడాల గ్రామంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. కంపచెట్లలో ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అంకిరెడ్డిపల్లె సమీపంలో ఎనిమిది మంది..

కొలిమిగుండ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరెడ్డిపల్లె సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు గురువారం వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.7వేల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



చాగలమర్రిలో అవగాహన ర్యాలీ చేస్తున్న తహసీల్దార్



రెవెన్యూ సదస్సులో కొలిమిగుండ్ల తహసీల్దార్, అధికారులు

చాగలమర్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. గురువారం చాగలమర్రి పాత పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మద్దిలేటి, ఆర్ఐ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

● **క్రిష్ణగిరి:** రెవెన్యు సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం టి.గోకులపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పని చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.

● **కొలిమిగుండ్ల:** మండలంలోని ఇటిక్యాలలో తహ సీల్దార్ బాలీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సద స్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

● **కోవెలకుంట్ల:** గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహస్దీలారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కోవెలకుంట్ల మండల పరిధిలోని లింగాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో వచ్చిన అర్జీలను తహసీల్దారు పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటుపుల్లయ్య మండల సర్వేయరు వీరన్న, టీడీపీ నాయకులు లింగాల నాయుడు పాల్గొన్నారు.

● **అవుకు:** గ్రామ సభలతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం శివవరం గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభలో భూ సమస్యల పరిష్కారం కోసం నాలుగు దరఖాస్తులు వచ్చాయని అన్నారు. వీటిని త్వరలో పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంగళరెడ్డి, సర్వేయర్ హరిక్రిష్ణ, వీఆర్‌వో ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

● **రుద్రవరం:** భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ సదస్సులు ప్రభుత్వం నిర్వహిస్తోందని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. గురువారం మండలంలోని కోటకొండలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. రైతులు తమ సమస్యలు ఉంటే గ్రామసభల దృష్టికి తేవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యంరాజు, వీఆర్వో గురుస్వామి పాల్గొన్నారు.

● రుద్రవరం మండలం బీరవోలు గ్రామంలో రీసర్వేపై ర్యాలీ నిర్వహించారు. రుద్రవరం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా బీరవోలు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు డివిజనల్ సర్వేయరు వెంకటచెన్నయ్య తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 8 గ్రామాల్లో రీసర్వే జరి గిందని, ప్రస్తుతం మిగిలి ఉన్న 11 గ్రామాల్లో రీసర్వే కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్వేయరు వెంకటరమణ పాల్గొన్నారు.

బేతంచెర్ల: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తోందని తహసీల్దార్ ప్రకాష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని గోర్లగుట్ట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూ వివాదాలు, భూ సమస్యలపై అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి, ఆర్ఐ హేమంత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.



బేతంచెర్ల మండలం గోర్లగుట్ట గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాష్‌బాబు



మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

బీసీకి నూతన సంవత్సర శుభకాంక్షలు

బనగానపల్లె, జనవరి 2, (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో పలువురు గురువారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 1వ తేదీ బీసీ రాజారెడ్డి అందుబాటులో లేకపోవడంతో 2వ తేదీ ఉదయం నుంచి పలువురు టీడీపీ నాయకులు, బీసీ రాజారెడ్డి అభిమానులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు బీసీ రాజారెడ్డిని కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ నాయకులు అమర్‌నాథరెడ్డి, శంఖేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, తిరుమలేశ్, తదితరులు అభినందించారు.

బీసీ ఇందిరమ్మకు శుభాకాంక్షలు

బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పలువురు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మకు పలువురు గురువారం కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 1వ తేదీ బీసీ ఇందిరమ్మ అందుబాటులో లేకపోవడంతో 2వ తేదీ ఉదయం నుంచి పలువురు టీడీపీ నాయకులు, బీసీ అభిమానులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు బీసీ ఇందిరమ్మను కలుసుకొని కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. హోటల్ అసోసియేషన్ సభ్యులు బీసీ ఇందిరమ్మను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అటవీ సంరక్షణకు ఫైర్‌లైన్

రుద్రవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణకు ఫైర్‌లైను ఏర్పాటు చేస్తున్నామని రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముందస్తుగా వేసవిలో అడవిలో చెలరేగే మంటలు ఒక ప్రాంత నుంచి మరో ప్రాంతానికి వ్యాపించకుండా ఉండేందుకు 35 కిలోమీటర్ల మేర ఫైర్‌లైను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రహదారులను దాటే క్రమంలో వన్యప్రాణులు కనిపించేలా క్యూలైను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చాగలమర్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన దూదెకుల సుబ్బరాయుడు (41) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దూదెకుల సుబ్బరాయుడు కౌలుకు తీసుకున్న పొలంలో మొక్కజొన్న పంటకు డిసెంబరు 26న గడ్డి మందు పిచికారి చేస్తూ అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు కర్నూలు వైద్యశాలకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



మాట్లాడుతున్న శిక్షకుడు

తూతూ మంత్రంగా శిక్షణ తరగతులు

ఉయ్యాలవాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యుల ఒక రోజు శిక్షణ కార్యక్రమం తూతూ మంత్రంగా ముగించారు. మండ లంలో 33 మంది చైర్మన్‌లు ఉండగా ఒక్కరూ కూడా హాజరు కాలేదు. ఉదయం 11.45 గంటలకు 20 మంది ఉపాధ్యాయులు మాత్రమే అక్కడ ఉన్నారు. కమిటీ చైర్మన్‌లు మాత్రం కనిపించలేదు. కమిటీ చైర్మన్‌ల గైర్హాజరుపై అక్కడ ఉన్న సిబ్బందిని అడుగగా ఆరుగురు వచ్చి వెళ్లిపోయినట్లు తెలిపారు. పాఠశాలల చైర్మన్లు లేకపోవటంతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి మమ అనిపించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బేతంచెర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో రామాంజనేయులు అధ్యక్షతన లారీ, ఆటో జీపు కార్మికుల సదస్సు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ దేశాభివృద్ధిలో రవాణా రంగం కీలకమైందని అన్నారు. సుమారు పది కోట్ల మంది రవాణా కార్మికులు ప్రత్యక్షంగా పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డ్రైవర్లు, యజమానులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పింఛన్ అందజేస్తున్న నాయకులు

శిరివెళ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గోవిందపల్లె టీడీపీ నాయకులు గంగదాసరి రవి చంద్రారెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వర రెడ్డి, గంగదాసరి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీరెడ్డి అన్నారు. మండలంలోని గోవిందపల్లెలో ఓ వితంతువుకు మొదటి నెలలోనే పింఛన్ అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరవతో గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



ప్యాపిలి సభలో మాట్లాడుతున్న పంచాయితీ అధికారి శివకుమార్



కోటకొండలో మాట్లాడుతున్న తహసీల్దారు మల్లికార్జునరావు

ప్యాపిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి ప్రజలు సహరించాలని పంచాయతీ అధికారి శివకుమార్ అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఇంటి, కొలాయి పన్నులను సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. తాగు నీరు, పారిశుధ్యం సమస్యలు ఉంటే పంచాయతీ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మీదేవి, ఏపీవో రమణ, హెల్త్‌ఎడ్యుకేటర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

● **బనగానపల్లె:** మండలంలోని మిట్టపల్లె, కాపులపల్లె గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ తులసిరెడ్డి గురువారం అన్నారు. మిట్టపల్లెలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి మనోహర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ తులసిరెడ్డి మాట్లాడుతూ సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వీఆర్వో మధు, సచివాలయ సిబ్బంది వరప్రసాద్, శేఖర్‌బాబు, సౌందర్య, రామసుబ్బయ్య, సుమలత, హుసేన్ పాల్గొన్నారు.

● **చాగలమర్రి:** ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత అని ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ అన్నారు. గురువారం చాగలమర్రి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తులశమ్మ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ సంచులు విక్రయించకుండా అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల పాల్గొన్నారు.

● **ఉయ్యాలవాడ:** గ్రామాల అభివృద్ధి కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఉయ్యాలవాడలో సర్పంచ్ మేకల ఓబులేసు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, ఎంపీటీసీ సుబ్బరాయుడు, ఏపీవో రవిప్రకాష్, మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి శేఖర్‌రెడ్డి, సాగు నీటి సంఘం అధ్యక్షుడు ఆకుల చిన్న వెంకట సుబ్బయ్య, కార్యదర్శి జయరామిరెడ్డి ఉన్నారు.



ఉయ్యాలవాడ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమా మహేశ్వర రావు

సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శప్రాయం



సావిత్రీబాయి పూలే చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న జడ్జి తంగమణి

డోన్ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆదర్శనీయం సావిత్రీబాయి పూలే జీవితమని డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి తంగ మణి అన్నారు. పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటాలను జడ్జి తంగమణి ఆవిష్కరించారు. అనంతరం వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, యూటీఎఫ్ పూర్వపు గౌరవాధ్యక్షులు బాబు, జిల్లా గౌరవాధ్యక్షులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



మాధవరం గ్రామస్థులకు చెక్కు పంపిణీ చేస్తున్న కోట్ల

డోన్ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో టీడీపీ కార్యాలయంలో డోన్ నియోకవర్గ టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి గురువారం బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. రూ.18,18,776 చెక్కులను ఆయన బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు.

ప్యాపిలి: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు గురువారం లద్దగిరిలో టీడీపీ యువ నాయుకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన అనుషాకు రూ.92 వేలు, కంబగిరికి రూ.24వేలు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాధవరం స్వామి, లక్ష్మీనారాయణ, కర్ణంరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

డోన్ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యు.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు. గత నెల 28వ తేదీన కాకినాడలో జరిగిన ఆ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్-17 విభాగంలో కొత్తపల్లి గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఫర్హానా, సుచిత్రలు ప్రతిభను కనబరిచి అండర్-17 విభాగంలో బంగారు పతకాలు సాధించారు. అయితే.. ఈ నెల 8 నుంచి 10 తేదీల్లో ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు సర్పంచ్ ఎర్రగుంట్ల వైవిధ్య రూ.5 వేల చొప్పున విద్యార్థినులకు ఆర్థిక సాయం అందజేశారు.

ఏబీ బర్దన్‌కు ఘన నివాళి



ఏబీ బర్దన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ 9వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో గురువారం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీ బర్దన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తిరుమలేష్, డి.దస్తగిరి, ఉదయ్, ఎల్లకృష్ణ, మధురామయ్య, మధు లక్ష్మయ్య పాల్గొన్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

డోన్ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌడ సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడులు హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు టీఈ రామకృష్ణగౌడు, టీఈ రాఘవేంద్రగౌడు, జలదుర్గం మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ డైరీ, స్టిక్కర్ల విడుదల

చాగలమర్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) నూతన క్యాలెండర్, డైరీ, స్టిక్కర్లను హెచ్ఎం కాంత్యాయణి ఏపీయూఎస్ జిల్లా కోశాధికారి శ్రీపతి ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి భావనలు పెంపొందించేందుకు ఏపీయూఎస్ సంఘం తమ వంతుగా కృషి చేస్తోందని పేర్కొన్నారు.

సమష్టి కృషితోనే మత్తు పదార్థాల నివారణ

బనగానపల్లె, జనవరి 2, (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే మత్తు పదార్థాల నివారణ సాధ్యమని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. గురువారం పలుకూరులో ధూమపానం, మద్యపానం మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, మత్తు పదార్థాల వల్ల లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారన్నారు. అనేక రకాల వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. డబ్బులు ఇచ్చి వ్యాధులను కొని తెచ్చుకుంటున్నామన్నారు. వీటి వల్ల జీవితాలు సర్వనాశనమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో టి.గురువయ్య, మద్దయ్య, బాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కోఆప్షన్ మెంబర్ మృతి

క్రిష్ణగిరి, జనవరి 2: క్రిష్ణగిరి గ్రామానికి చెందిన మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ నక్క షాలు(షాల్మియా)(70) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంసీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, జడ్పీటీసీ కేఈ సుభాషిణి షాల్మియా మృతదేహానికి పూల మాలలు వేసి నివాళర్పించారు. షాల్మియా మృతి బాధాకరమని వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

చాగలమర్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చిన్నవంగలి గ్రామంలో పిచ్చికుక్కల దాడిలో గురువారం ఎనిమిది మంది గాయపడ్డారు. గ్రామంలోని బాల సంజీవరెడ్డి, చిన్నకొండారెడ్డి, ఓబులేసు, పెద్ద సంజీవరెడ్డి, హరిశ్చంద్రుడుతోపాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సీ కాలనీ సమీపంలో వెళ్తుండగా పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. గాయపడిన వారు చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ర్యాబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేయించుకున్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి

కొలిమిగుండ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంట్ పరిశ్రమ దత్తత గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలన కోసం తమవంతు కృషి చేస్తామని పరిశ్రమ యూనిట్ హెడ్‌రెడ్డి నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని కల్వటాలలో క్షయ వ్యాధి నిర్మూలన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమ మైన్స్ జీఎం అజ్మల్‌అహ్మద్, నాయుడు, నరేష్, డా.శశిధర్ పాల్గొన్నారు.